




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 | సంచిక : 13 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | బుధవారం 18 సెప్టెంబర్ 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda






## గంగమ్మ ఒడికి సప్తముఖ
# మహా గణపతి

### ఖైరతాబాద్‌బడా గణేశ్‌కి వీడ్కోలు పలికిన భక్తులు

- ఎన్టీఆర్‌మార్గ్‌లోని 4 నంబర్ క్రేన్ వద్ద నిమజ్జనం
- అట్టహాసంగా ముగిసిన శోభాయాత్ర
- సెక్రటేరియట్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు నడుచుకుంటూ వెళ్లిన సీఎం



**హైదరాబాద్ పెన్ పవర్ :** ఖైరతాబాద్ బడా గణేశ్ " నిమజ్జనం అట్టహాసంగా ముగిసింది. వేలాది భక్తుల మధ్య ఎన్టీఆర్ మార్గ్లో ని 4 నంబర్ క్రేన్ వద్ద సప్తముఖ మహా గణపతిని హుస్సేన్ సాగర్ లో నిమజ్జ నం చేశారు. 9 రోజులు పూజలందుకు న్నగణనాథుడికి వేలాదిమంది భక్తులు వీడ్కోలు పలికారు. తమను చల్లగా చూడాలని చివరిసారి దర్శించుకున్నా రు. అంతకుముందు 70 అడుగుల 7 లంబోదరుడికి ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభ మైన శోభాయాత్ర వైభవంగా సాగింది. సంప్రదాయ వేషధారణలో మహిళలు చేసిన నృత్యం ఎంతగానో ఆకట్టుకుం ది. మధ్యాహ్నానికి హుస్సేన్సాగర్ వద్దకు చేరుకుంది. వచ్చే ఏడాది మళ్లీ వస్తానంటూ గణపయ్య గంగమ్మ ఒడికి చేరాడు. అంతకుముందు ఉదయం 6.30 గంటలకు శోభాయాత్ర స్టార్ట య్యింది. మధ్యాహ్నాం 1.30 గంటల లోపు నిమజ్జనం చేయాలన్న లక్ష్యంతో అధికారులు, ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. శోభాయాత్ర వెహికిల్ ముందు భక్తులు ఎక్కువగా జమ అవకుండా రెండు అంచెల్లో రోప్ పార్టీ భద్రత మధ్య శోభాయాత్ర కొన సాగుతోంది. శోభాయాత్ర ముందు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నృత్యం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. సంప్రదాయ వేషధారణలో మహిళలు చేసిన నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది.

## బాలాపూర్ లడ్డూ రూ.30.01లక్షలు

- బాలాపూర్ లడ్డూ కు రికార్డు ధర
- 30 లక్షలకు దక్కించుకున్న కొలను శంకర్ రెడ్డి
- గతేడాది 27 లక్షలకు పాడిన దాసరి దయానంద్ రెడ్డి
- గంగమ్మ ఒడికి బాలాపూర్ గణేష్



**హైదరాబాద్ పెన్ పవర్:**బాలాపూర్ గణేష్ నిమజ్జనం పూర్తయింది. ఎన్టీఆర్ మార్గ్ లోని క్రేన్ నంబర్ 12 దగ్గర వినాయకుడిని నిమజ్జనం చేశారు అధికారులు. భారీ క్రేన్ సాయంతో గంగమ్మ ఒడికి చేరాడు గణనా థుడు. చివరి సారిగా భక్తులు లంబోదరుడిని దర్శించుకున్నారు. బాలాపూర్ హనుమాన్ టెంపుల్ నుంచి ఉదయం

వివరాలు 2లో..

## ఎన్ని విమర్శలు వచ్చినా కూల్చివేతలు ఆపేదిలేదు

- హైడ్రాపై ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు
- దీని వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని వివరణ
- తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకల్లో రేవంత్ రెడ్డి ప్రసంగం



**హైదరాబాద్ పెన్ పవర్:**చెరువులు, కుంటలలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చివేసే విషయంలో వెనక్కి తగ్గేదే లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## జర్నలిస్టులందరికి త్వరలో ఇళ్ళ స్థలాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**అనుభవం, అర్హత కలిగిన జర్నలిస్టులందరికి త్వరలో ఇళ్ళ స్థలాలు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా పాలసీ తీసుకొస్తామన్నారు. వరంగల్ నగరంలో నాళాలు ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. బఫర్ జోన్ లల్లో నిర్మాణాల్లో అధికారులు గుర్తించాలని ఆదేశించారు. బీపీఎల్ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామన్నారు. నాలాలపై నిర్మించిన ఇళ్లను తొలగిస్తామన్నారు. బడా బాబులు కబ్జాలు చేస్తే ఊరుకోమన్నారు. ఎవరైనా, ఎంతటి వారైనా సరే వదిలి పెట్టేది లేదంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వివరాలు 2లో..

## పాతబస్తీ పక్కా హిందువులదే.. వాళ్లను తరిమి కొడ్తం



**హైదరాబాద్ పెన్ పవర్:**పాత బస్తీలోని ప్రతీ గల్లిలో గణేష్ పండుగ గ్రాండ్ గా జరుగుతుం దన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఆయన..హిందూ సమాజానికి ఏదైనా సమస్య వస్తే ముందుకు వచ్చేవారు హిందువులన్నారు. పాతబస్తీ పక్కా హిందువులదేనన్నారు. పాత బస్తీ వదిలి వెళ్ళిన

వివరాలు 2లో..

## సీఎం రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర భవిష్యత్ కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు మాజీ మంత్రి హరీశ్ రావు. ప్రజాపాలన దినోత్సవంలో రేవంత్ రెడ్డి అన్ని అబద్ధాలే మాట్లాడారని చెప్పారు. ఆర్థిక సంఘాన్ని తప్పుదోవ పట్టించేందుకు



వివరాలు 2లో..

## ఆపేయండి

### బుల్డోజర్ కూల్చివేతలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు





- దేశవ్యాప్తంగా బుల్డోజర్ సంస్కృతిపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- పలు రాష్ట్రాల్లో నేరస్తులు, సంఘ వ్యతిరేక శక్తుల ఇళ్ల కూల్చివేత
- బుల్డోజర్ న్యాయం పేరిట చర్యలను నిరసిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు
- విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం
- అక్టోబరు 1 వరకు బుల్డోజర్ చర్యలు వద్దన్న అత్యున్నత న్యాయస్థానం

వివరాలు 2లో..

## ఢిల్లీ కొత్త సీఎంగా అతిశీ

### ఎన్నికలు అయ్యేంత వరకే నేను ముఖ్యమంత్రిగా ఉంటాను... ఆ తర్వాత మళ్లీ కేజ్రీవాలే



- ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాక కేజ్రీవాల్ సీఎంగా బాధ్యతలు చేపడతారన్న అతిశీ
- ఇతర పార్టీల్లో ఉంటే తనకు టిక్కెట్ కూడా దక్కకపోయేదని వ్యాఖ్య
- కేజ్రీవాల్ మాత్రం తనను ఎమ్మెల్యే స్థాయి నుంచి సీఎంగా చేశారన్న అతిశీ

వివరాలు 2లో..

## భూమిలేని పేదల అకౌంట్లో రూ. 12 వేలు

- ఈ ఏడాది నుంచే అమలు చేస్తం
- త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం
- ఎస్సీ, ఎస్టీలకు రూ. 6 లక్షలు, మిగతా వారికి రూ. 5 లక్షల చొప్పున ఇస్తం
- సోలార్ పంపు సెట్ల కోసం సిరిపురం ఎంపిక
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# ఇక మావోయిస్టులు చరిత్రేనా

మావోయిస్టులను అంతం చేస్తాం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అయితే తమను అరికట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్ ను అడ్డుకుంటామని మావోయిస్టులు అంటున్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వానికి అంతర్గత భద్రత విషయంలో కంట్లో నలుసుగా మారింది మావోయిస్టు పార్టీ. దేశ అభివృద్ధికి మావోలు ఆటంకం అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంటే, దేశ సంపదను ప్రజలకు పంచకుండా గంప గుత్తగా ఒకరిద్దరు పెట్టుబడి దారుల చేతుల్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని మావోయిస్టు పార్టీ ఆరోపిస్తుంది. 2026 నాటికి మావోయిస్టు పార్టీని దేశంలో అంతం చేయడమే మా లక్ష్యం అని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు ప్రకటిస్తే, మీా ఆపరేషన్ కగార్ ను అడ్డుకుని తీరడమే మా పంతం అని మావోయిస్టులు ప్రకటిస్తున్నారు. మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్, ఆంధ్ర – ఒరిస్సా బోర్డర్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో అంటే మావోయిస్టుల ప్రభావ ప్రాంతాల్లో ఓ యుద్ధమే జరుగుతుందని చెప్పాలి. నిత్యం తుపాకి చప్పుళ్లతో, మందు పాతర పేలుళ్లతో అటవీ గ్రామాలు చిగురుటాకుల్లో వణికిపోతున్నాయి. పచ్చటి అడవిలో వెచ్చటి నెత్తురు వర్షం కురుస్తోంది. ఇంతటి భీతావాహ పరిస్థితులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నెలకొంది. ఇదంతా ఎందుకంటే ఈ నెల 21వ తేదీ నుండి అక్టోబర్ 20వ తేదీ వరకు పార్టీ సంస్థాపక వార్షికోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి, పార్టీ శ్రేణులకు, మావోయిస్టు సానుభూతిపరులకు పిలుపునిచ్చింది. ఇరవై ఏళ్లలో మావోయిస్టు పార్టీ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది. దాడులు –ప్రతి దాడుల మధ్య నలిగిపోయింది. అత్యంత కఠినమైన పరిస్థితులను క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంది. సేఫ్ జోన్లు అనుకున్న చోట రక్తం ఏరులై పారింది. పట్టణ ప్రాంతాల్లో షెల్టర్ ఇచ్చే వారు, పార్టీకి ఫండింగ్ చేసే వారు కరువయ్యారు. కోవర్ట్ ఆపరేషన్లు ఎదుర్కొంది. కీలమైన ముఖ్య నాయకులను పార్టీ కోల్పోయింది. గడచిన 20 ఏళ్లలో 22 మంది కేంద్ర కమిటీ సభ్యులను ఎన్ కౌంటర్లలో కోల్పోయింది. అందులో 8 మంది కీలకమైన పొలిట్ బ్యూరో సభ్యులు ఉన్నారు. పోలీసు దాడుల్లో 5249 మంది మావోయిస్టులు చనిపోయారు. ఇందులో దాదాపు వేయి మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఈ ఏడాది జులై వరకు లెక్క తీస్తే పోలీస్ దాడుల్లో 171 మంది ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల లెక్క ప్రకారం 63 మంది సాధారణ పౌరులు, 44 మంది మావోయిస్టులు ఉన్నారు. ఇందులో 8 మంది గ్రామాణ మహిళలు ఉన్నారు. బీజాపూర్ జిల్లా ముద్దం గ్రామంలో 6 నెలల పసికందు ప్రాణాలు కోల్పోయింది. ఇంతటి మారణహోమం తమ పార్టీ ఎదుర్కొన్నట్ల మావోయిస్టులు తాజా విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. తామేం తక్కువ తినలేదని నిర్బంధం, ఎన్ కౌంటర్లను ఎదుర్కొంటునే ఈ 20 ఏళ్లలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ 4073 దాడులు నిర్వహించినట్లు మావోయిస్టులు చెబుతున్నారు. ఇందులో 3090 మంది చనిపోయారన్నది కామ్రేడ్స్ లెక్క. అయితే మూడేళ్లుగా శత్రువు నిర్బంధ పరిస్థితుల్లో, పోలీస్ దాడుల్లో పార్టీ నష్టపోకుండా ఉండేందుకు డిఫెన్స్ వ్యూహంలో ఉన్నట్లు మావోయిస్టులు చెబుతున్నారు. అంటే అగ్రెసీవ్ గా తాము ఎదురు దాడులు చేయకుండా వెనుకంజ వ్యూహంతో సాగుతుంటే కేంద్ర ప్రభుత్వమే రెచ్చగొట్టేలా ఆపరేషన్ కగార్ పేరుతో తమపై దాడులకు దిగుతోందన్నది మావోయిస్టు పార్టీ ఆరోపణ. ఈ మూడున్నరేళ్లలో 439 మంది పార్టీ సభ్యులను కోల్పోయామని, 215 ఆయుధాలు కోల్పోయినట్లు, కొంత మేర ఉద్యమం కూడా బలహీనపడిందని మావోయిస్ట్ పార్టీ తన అంతర్గత సమీక్షలో తెల్చి చెప్పింది. అయితే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్ ను మాత్రం తిప్పికొట్టడం ఖాయమని ఇదే తమ లక్ష్యమని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. 2026 కల్లా దేశంలో మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మోదీ ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే.. తమ వందరోజుల పాలనలో మావోయిస్టులను అంతం చేయడం తమ ప్రాధాన్యత అంశంగా కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2014 నాటికి దేశంలో మావోయిస్టు పార్టీ దాదాపు 200 జిల్లాల్లో తమ ప్రభావం చూపుతుంటే, దాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ప్రభావం తగ్గించామని చెబుతోంది. 2024 సెప్టెంబర్ నాటికి 43 జిల్లాలకు మాత్రమే మావోయిస్టుల ప్రభావాన్ని పరిమితం చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ ఏడాది జనవరి నాటికి 700 మంది మావోయిస్టులను లొంగిపోయేలా చేయడమే, లేక ఎన్ కౌంటర్లలో చంపడమో జరిగిందని కేంద్ర ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయి. 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని ఇదే తమ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ చెబుతోంది. ఇది కేంద్ర ప్రభుత్వ వర్సెస్ మావోయిస్టు పార్టీ అన్నట్లుగా మారింది. అయితే ప్రస్తుత ప్రజాస్వామిక దేశంలో భౌతికంగా రూపు మాపడం వల్ల ఒక సిద్దాంతం చచ్చిపోతుందనుకుంటే అది భ్రమే. ఇప్పటి వరకు ప్రపంచ చరిత్ర చూసినా, మన దేశంలో నక్సలిజం పురుడు పోసుకున్నప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన నక్సల్ చరిత్ర చూసినా అతి తప్పే అని అర్థం అవుతుంది. అదే రీతిలో ఓ ప్రజా స్వామ్య దేశంగా పరిణితి చెందుతూ అడుగులు వేస్తోన్న మన భారత దేశంలో తుపాకితనో, తూటాలతోనో రాజ్యం సాధిస్తామని అనుకోవడం కూడా ఓ భ్రమే. ప్రజా బలంతో రాజ్యాల నిలబడతాయే తప్ప తుపాకి తూటాలతో రాజ్యాన్ని సాధించుకోలేమన్నది కూడా మన కళ్ల ముందు ఉన్న చరిత్రనే. ఈ చరిత్ర చెబుతోన్న పాఠాలు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు మావోయిస్టు పార్టీ గుర్తిస్తే మన దేశం ప్రజాస్వామ్య పరిణితి గల దేశంగా మరింత ముందుకు సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఎన్ని విమర్శలు వచ్చినా కూల్చివేతలు ఆపేదిలేదు

- మొదటి పేజీ తరువాయి

హైడ్రాపై ఎన్ని విమర్శలు వచ్చినా ముందుకే వెళతామని వివరించారు. ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. హైడ్రా ఏర్పాటు, కూల్చివేతల వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు తమకు లేవని తేల్చిచెప్పారు. ఈమేరకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్ టీఎల్), బఫర్ జోన్ లలో కట్టిన బిల్డింగ్ లు ఎంతపెద్ద వారివైనా వదిలిపెట్టబోమని రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. ఈ విషయానికి సంబంధించి హైడ్రా ఇప్పటికే పలువురు ఆక్రమణదారులకు, బడాబాబులకు నోటీసులు ఇచ్చిందని గుర్తుచేశారు. హైడ్రా పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం... అధికారుల పనిలో తమ జోక్యం ఉండదని వివరించారు. కాగా, ఎఫ్ టీఎల్ పరిధిలోని నిర్మాణాలకు సంబంధించిన యజమానులకు హైడ్రా నోటీసులు పంపించింది. వెంటనే వాటిని కూల్చేయాలని హెచ్చరించింది. లేదంటే తామే రంగంలోకి దిగి వాటిని కూల్చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# ఆపేయండి బుల్డోజర్ కూల్చివేతలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**పెన్ పవర్ డెస్క్:** దేశంలో పెరిగిపోతున్న బుల్డోజర్ కల్చర్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీ వరకు దేశవ్యాప్తంగా బుల్డోజర్ కూల్చివేతలపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు బుల్డోజర్ చర్యలు చేపట్టొద్దని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే, ప్రభుత్వ స్థలాలు, ఫుట్ పాత్, రైల్వే లైన్లు, జలవనరుల ఆక్రమణలు, రోడ్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవచ్చుని.. వాటికి ఈ ఉత్తర్వులు అమలు కావని స్పష్టం చేసింది. కాగా, ఇటీవల దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బుల్డోజర్ కల్చర్ పెరిగిపోతుంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో నేరారోపణలో నిందితులుగా ఉన్న వ్యక్తుల నివాస లేదా వాణిజ్య ఆస్తులను ప్రభుత్వాలు బుల్డోజర్ల ద్వారా నేలమట్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో బుల్డోజర్ చర్యలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఇవాళ ఈ పిటిషన్లపై జస్టిస్ బిఆర్ గవాయ్, కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. నేరారోపణలు ఎదుర్కొంటున్న నిందితుల ప్రైవేట్ స్థలాలను బుల్డోజర్ల ద్వారా కూల్చివేయడం సరైన చర్య కాదని పేర్కొంది. దేశంలో ఎక్కడైనా ప్రైవేట్ ఆస్తులను అనధికారికంగా కూల్చివేయడంపై అక్టోబరు 1 వరకు స్టే విధించింది. కూల్చివేతలపై స్టే విధిస్తే.. ఇప్పటికే కూల్చివేతలకు సిద్ధమైన పనులపై ప్రభావం చూపుతోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించగా.. ఆయన వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు బుల్డోజర్ కూల్చివేతలు ఆపితే స్వర్గం ఏమి ఊడిపడదని ధర్మాసనం పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు బుల్డోజర్ చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. అయితే, ప్రభుత్వ స్థలాలు, ఫుట్ పాత్, రైల్వే లైన్లు, జలవనరుల ఆక్రమణలు, రోడ్ల ఆక్రమణలపై చర్యలకు సుప్రీంకోర్టు మినహాయింపు ఇచ్చింది. వాటికి ఈ ఉత్తర్వులు అమలు కావని స్పష్టం చేసింది. అనంతరం ఈ పిటిషన్లపై విచారణను వాయిదా వేసింది.

# ఢిల్లీ కొత్త సీఎంగా అతిశీ

**పెన్ పవర్ డెస్క్:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగేంత వరకు మాత్రమే తాను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటానని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాక మళ్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ బాధ్యతలు చేపడతారని అతిశీ అన్నారు.
తదుపరి ఢిల్లీ సీఎంగా ఎంపికైన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... తాను ఇతర పార్టీల్లో ఉన్నట్లయితే కనీసం టిక్కెట్ కూడా దక్కకపోయేదన్నారు. కానీ కేజ్రీవాల్ తనకు టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యేను చేసి, ఆ తర్వాత మంత్రిని చేసి, ఇప్పుడు ముఖ్యమంత్రిని చేశారని వెల్లడించారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు తెలిపారు.
తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించారన్నారు. ఇలాంటి అవకాశం కేవలం ఆమ్ ఆద్మీ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనకు ఈ అవకాశం కల్పించారని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయడం తనకు ఎంతో బాధ కలిగించిందన్నారు. తాను ముఖ్యమంత్రి పదవి చేపట్టానని అభినందించవద్దని,
పూలమాలలు అవసరం లేదని సూచించారు. ఎన్నికల తర్వాత మళ్లీ కేజ్రీవాల్ సీఎం అవుతారన్నారు. మద్యం పాలసీ కేసులో తప్పుడు ఆరోపణలతో కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు కేంద్రంలోని బీజేపీకి, దర్యాప్తు సంస్థలకు చెంపపెట్టు అన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్ అక్రమం అని అన్నారు. కేజ్రీవాల్ స్థానంలో మరొకరు ఉంటే పదవిని వదులుకునే వారు కాదన్నారు.

# భూమిలేని పేదల అకౌంట్లో రూ. 12 వేలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది నుంచి భూమిలేని నిరుపేదల బ్యాంకు ఖాతాల్లో ఏడాది 12 వేలు వేస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఇవాళ ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో రెండో విడుత దళిత బంధు మంజూరు పత్రాలను డిప్యూటీ సీఎం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. నిరంకుశ రాచరిక పరిపాలన నుంచి తెలంగాణ రాష్ట్రం ప్రజాస్వామ్య పరిపాలనలోకి వచ్చినందున ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం చేసిన ఈ ప్రకటనను వ్యతిరేకించిన వారు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించినట్టే. అవుతుందన్నారు. సెప్టెంబర్ 17 దినోత్సవం విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్న పార్టీల నాయకులు ప్రజా ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలన దినోత్సవాన్ని స్వాగతించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టబోతున్నామని చెప్పారు. ఇప్పటికే భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు ఆరు లక్షల రూపాయలు ఇతర లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ అందిస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ, పంటల బీమా, రైతు బీమా, సబ్సిడీ విద్యుత్తు అందించడంతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సోలార్ వ్యవసాయ పంపు సెట్లు తీసుకొస్తున్నామని వివరించారు.
మధిర నియోజకవర్గం సిరిపురం గ్రామాన్ని సోలార్ వ్యవసాయ పంపు సెట్ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. సోలార్ విద్యుత్తు వ్యవసాయం పంపు సెట్ల వినియోగానికి పోగా

మిగిలిన కరెంటును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దీని ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములు చేసే విధంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందన్నారు. సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడానికి స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే రుణాలు ఇప్పిస్తుందని చెప్పారు.

# పాతబస్తీ పక్కా హిందువులదే.. వాళ్లను తరిమి కొడ్తాం

- మొదటి పేజీ తరువాయి

హిందువులంతా తిరిగి రావాలని పిలుపునిచ్చారు.
ఓల్డ్ సిటీని న్యూ సిటీగా మార్చేవరకు ఊరుకోమన్నారు బండి సంజయ్. ఓల్డ్ సిటీలో ఉగ్రవాదులకు షెల్టర్ ఇచ్చిన వాళ్ళని తరిమి తరిమి కొడతామని హెచ్చరించారు బండి సంజయ్. హిందువుగా పుట్టినందుకు హిందూ ధర్మ రక్షణ కోసం సమయం కేటాయించాలన్నారు బండిసంజయ్. భాగ్యలక్ష్మి అమ్మవారి పాదాల సాక్షిగా భారత్ మాతా కి జై అని నినదించాలన్నారు.
గణేష్ ఉత్సవాల్లో భక్తి, దేశభక్తి కలసి ఉంటాయన్నారు. హిందూ సమాజం, దేశం పట్ల ఎవరైనా అనుచితంగా మాట్లాడితే... అందరం ఒక్క తాటి పైకి రావాలన్నారు. హిందూ పండుగలు చేసుకోవాలంటే అన్ని పర్మిషన్లు కావాలి..కానీ
వేరే పండుగలకు ఎలాంటి ఆంక్షలుండవన్నారు బండి సంజయ్. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పోరాటం చేస్తే ట్యాంక్ బండ్ పై నిమజ్జనం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రంజాన్ పండుగకు రూ. 3కోట్లు కేటాయించింది కానీ..హిందూ పండగలకు డబ్బులు కేటాయించలేదని విమర్శించారు. తాము ఇతర మతాలకు వ్యతిరేకం కాదన్నారు.

# బాలాపూర్ లడ్డూ రూ.30.01లక్షలు

- మొదటి పేజీ తరువాయి

ఊరేగింపు మొదలై గణేశ్‌చౌక్ ఎడమ వైపు నుంచి డైమండ్ హొటల్, బాలాపూర్ గణేశుడు అక్కడి నుంచి మైసమ్మకట్ట మీదుగా చాంద్రాయణగుట్ట, చార్మినార్, అఫ్జల్‌గంజ్,ఎంజే మార్కెట్ .. అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టీ వై జంక్షన్ మీదుగా ట్యాంక్‌బండ్ వరకు శోభాయాత్ర జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చారు.
మరో వైపు బాలాపూర్ గణేశుడి లడ్డు ఈ ఏడాది ( 2024 ) 30 లక్షల వెయ్యి రూపాయలు పలికింది.. కొలన్ శంకర్ రెడ్డి అనే వ్యక్తి బాలాపూర్ లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. గత ఏడాది కంటే.. ఈసారి 3 లక్షల రూపాయలు అదనంగా పలికింది. బాలాపూర్ లడ్డూ వేలంలో ఇదే రికార్డ్.

తొలి వేలంలో రూ. 450లకే..

బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంపాట 1994 నుంచి జరుగుతోంది. వారం పాటు స్వామివారితో పాటు పూజలందుకున్న లడ్డూను చివరి రోజు వేలం వేయడం ప్రారంభమైంది. బాలాపూర్ ముఖ్య కూడలిలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తొలి ఏడాది జరిగిన వేలం పాటలో బాలాపూర్ లడ్డూను రూ. 450లకు ఓ భక్తుడు దక్కించుకున్నాడు. ఏటేటా లడ్డూ వేలం పాటలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరగడం, దాంతోపాటే లడ్డూకు భారీ ధర పలకడం జరుగుతూ వస్తోంది. 2020లో కరోనా కారణంగా వేలం పాట రద్దు చేశారు.

# జర్నలిస్టులందరికి త్వరలో ఇళ్ల స్థలాలు

- మొదటి పేజీ తరువాయి

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు లో అర్హులైన పేదలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు మంత్రి పొంగులేటి. అక్టోబర్ 2 న కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్ ప్రారంభిస్తారని చెప్పారు. ఏమైనా పెండింగ్ పనులు ఉంటే.. పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు స్పీడ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎయిర్ పోర్ట్ పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశాలు.

# సీఎం రేవంత్‌వి పచ్చి అబద్ధాలు

- మొదటి పేజీ తరువాయి

బురద జల్లుతున్నారని విమర్శించారు. 4 వేల పిన్షన్ ఏమయ్యిందని ప్రశ్నించారు. తెలంగాణ అప్పు రూ 4.26 లక్షల కోట్లు ఉంటే.. రూ. 6 .85 లక్షల పైన ఉందని రేవంత్ అబద్దాలు చెబుతున్నారని హరీశ్ రావు చెప్పారు. జై తెలంగాణ అనని వాళ్లు.. అమర వీరుల స్థూపం దగ్గర శ్రద్ధాంజలి ఘటించారని విమర్శించారు. రేవంత్ చిల్లర రాజకీయాలు మాని ప్రజలకు మంచిపాలన అందించాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా రేవంత్ లాగా వ్యవహరించ లేదన్నారు హరీశ్ రావు.

# అధికారులకు అచ్చెన్నాయుడు స్వీట్ వార్నింగ్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ శ్రీకాకుళం, సెప్టెంబర్ 17:** టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు పలు ప్రభుత్వ కార్యాలయాలను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. సిబ్బందిపై ఆరా తీశారు. మొదటిసారిగా క్షమించి వదిలేస్తున్నాను.. ప్రజలు ఎవరైనా సరే ఇబ్బందులు పడ్డారని తన దృష్టికి వస్తే మాత్రం క్షమించేది లేదన్నారు. గత ప్రభుత్వం లాగా ఈ ప్రభుత్వం కాదు.. ప్రజల కోసం మాత్రమే పని చేస్తుందన్నారు. ఏ అధికారైనా సరే ఆఫీస్ పనులు నిమిత్తం బయటకు వెళితే పరవాలేదు, వ్యక్తిగత పనులకు మాత్రం ఊరకనే వెళ్తే మాత్రం తాను రంగంలో దిగవలసి వస్తుందని హెచ్చరించారు. ఇప్పుడైతే అచ్చెన్నాయుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పరిగెత్తారు, ఇక అధికారులు పరుగులు పరుగున అక్కడికి చేరుకొని.. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న సమస్యలపై ఆయనకు వివరించారు. ఇక మీరు ఏం చేస్తారో నాకు తెలియదు, ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో వెంటనే దాన్ని పరిష్కరించాలంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చి వెళ్లారు. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల విశ్వాసం పెంచేలా సేవలు అందించాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు అన్నారు. మంత్రి తన పర్యటనలో భాగంగా టెక్కలి ప్రభుత్వ అసువత్రి వద్ద నూతన మార్చరీ రూమ్, వేస్టేజ్ స్టోర్‌రూమ్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్కు, ఇంజనీరింగ్ భాగం అధికారులకు, కాంట్రాక్టర్లకు సోమవారం నుంచి పనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఏపీ ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఎక్కడా రాజీపడకుండా వైద్య రంగానికి ప్రభుత్వం తగిన సహ కారం అందిస్తున్నట్టు చెప్పారు. ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షలు నిర్వహిస్తూ పేదలు అందించే వైద్యసేవలపై నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వైద్యులు తమ విధులను మరింత బాధ్య తతో నిర్వహించాలని, చిన్న పాటి నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం కాకూడదని సూచించారు. రోగులను నవ్వుతూ పలకరించాలన్నారు. కోవిడ్19 సమయంలో మంచి సేవలు అందించినందుకు అభినందిస్తూనే, వైద్యులు తమ బాధ్యతను మరవకుండా మరింతగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. విధుల్లో ఉదాసీనత ఉండకూడదని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే సరిదిద్దుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో లిఫ్ట్ పని చేయకపోవడం, రోగులు ఇబ్బందులు పడు తున్నట్లు తెలిసిందని దానిపై ఆసుపత్రి సూపరింటెండెంటును మంత్రి అచ్చెన్నాయుడు వివరణ కోరగా వర్క్ లోడ్ వల్ల సుమారు 20 నిమిషాల పాటు పని చేయలేదని తెలుపగా.. మంత్రి తక్షణం స్పందించి భవిష్యత్తులో ఇటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రభుత్వం ఆసుపత్రికి పక్కనే ఉన్న మత్స్య శాఖ కార్యాలయం దారిలో గోశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి సరిహద్దులు వెయ్యాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి శూన్యమని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి ఎక్కడా కానరాలేదని, రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసి ఐదేళ్లపాటు బీమాను కూడా చెల్లించని ప్రభుత్వం అని అచ్చె న్నాయుడు అన్నారు. మంత్రి తన పర్యటనలో భాగంగా టెక్కలి గ్రామ పంచాయతీ కార్యాలయంలోఅధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంటి పన్నులు, తాగునీటి సమస్యల పరిష్కారం, పశువుల సంచారం లేకుండా చర్యలు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ, పారిశుధ్య కార్మికుల సమస్యలు తదితర అంశాలపై ఆరాతీసి సంబంధిత అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఇంటి పన్నును సకాలంలో వసూలు చేయా లని సూచించారు. సిబ్బంది సక్రమంగా పనిచేయాలని, అసెస్మెంట్ లేనివారు తక్షణమే వేయించుకోవాలని హితవు పలికారు. టెక్కలి పట్టణం అత్యంత సుందరీ కారణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలని అన్నారు. త్వరలో సులభ కాంప్లెక్స్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. సి.ఎస్.ఆర్ నిధుల నుంచి నిర్మాణం చేపడతామని అన్నారు. బాధ్యతగా పనిచేస్తే మన లక్ష్యానికి చేరుకుంటామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవన్నారు.

# బెజవాడలో పన్నుల కోసం ఒత్తిడి




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 17:** విజయవాడ నగరాన్ని వరదలు ముంచెత్తి నగరంలోని 32 డివిజనల్లో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులుగా మారారు. పది రోజుల పాటు వరద ముంపులో చిక్కుకున్న ప్రజలు ఇప్పుడిప్పుడే ఇళ్లకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ ఆదివారం జారీ చేసిన ప్రకటనతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. వరద బాధితులపై ఏమాత్రం సానుభూతి లేకుండా సెప్టెంబర్ 30వ తేదీలోగా పన్ను బకాయిలు చెల్లించాలని హెచ్చరికలు జారీ చేయడంపై ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను బకాయిదారులంతా తమ తమ ఆస్తి పన్ను, మంచి నీటి కుళాయి చార్జీలు, డ్రైనేజి చార్జీలు, వాటర్ మీటర్ చార్జీలు, ఖాళీ స్థలముల పన్నులను మొదటి అర్థ సంవత్సరానికి సెప్టెంబర్ 30వ తేదీలోగా చెల్లించాలని ఆదివారం నగర పాలక సంస్థ ప్రకటించింది. 30వ తేదీలోపు పన్ను చెల్లించకపోతే జరిమానాలు ఉంటాయని, నగరంలోని 3 సర్కిల్ కార్యాలయాల్లో , విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పన్నులు చెల్లించాని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో లక్షలాది మంది కట్టుబట్టలతో మిగిలారు. ఒక అంతస్తులోపు ఉన్న భవనాలు, రేకుల షెడ్లు, పెంకుటిళ్లలో ఉంటున్న వారికి కట్టుబట్టలు మినహా ఏమి మిగల్లేదు. సెప్టెంబర్ 1వ తేదీ తెల్లవారుజామున నిద్రలో ఉండగా వరద ముంచెత్తడం ప్రాణాలు కాపాడుకునే క్రమంలో ఎవరికి ఏమి మిగలకుండా పోయింది. ఈ క్రమంలో నగర పాలక సంస్థ పన్ను బకాయిల కోసం ప్రకటనలు ఇవ్వడం వరద బాధితుల్లో ఆగ్రహానికి కారణమైంది. వరద బాధితులకు ఇంటి పన్ను రద్దు చేయకపోగా, 15 రోజుల్లో చెల్లించకపోతే పెనాల్టీ పడుతుందని హెచ్చరిస్తూ ప్రకటనలు విడుదల చేయడంపై రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విజయవాడ నగరంలో 32 డివిజన్లలో దాదాపు 2,70,000 కుటుంబాలకు పైగా వరద ముంపుకు గురయ్యారు. వీరిలో కనీసం లక్షన్నర కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉండే అల్పాదాయ వర్గాలకు చెందిన వారే ఉంటారు. దాదాపు 8 లక్షల మంది జనాభా వరదల్లో నీట మునిగి సర్వస్వం కోల్పోయారు. ఉపాధి లేక, వస్తువులు, వాహనాలు పాడైపోయి దుర్భర పరిస్థితులలో వేలాదిమంది చిక్కుకున్నారు. వేతన జీవులు మినహా అసంఘటిత రంగంలో ఉపాధి పొందే వారి పరిస్థితి ఘోరంగా ఉంది. వరద ముప్పును హెచ్చరించడంలో విఫలమైన విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం పన్ను వసూళ్ల విషయంలో మాత్రం ప్రకటనలివ్వడంపై వరద బాధితుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. విజయవాడలో వరద నష్టం తీవ్రత పెరగడానికి ప్రజలను ఏమాత్రం అప్రమత్తం చేయని వ్యవస్థల వైఫల్యమే ఎక్కువగా ఉంది. బాధితులను ఆదుకోవాల్సిన సమయంలో పన్నులు చెల్లించకపోతే? జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తూ ప్రకటనలు జారీ చేయడంపై వామపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నెలాఖరులోగా పన్నులు చెల్లించకపోతే పెనాల్టీలు పడతాయని పరోక్షంగా హెచ్చరించటం బాధాకరమని, సెలవు దినాలతో సహా, రాత్రి 8 గంటల వరకు వసూళ్లు వసూలు చేస్తామని అధికారులు ప్రకటించడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిగురుపాటి బాబురావు తప్పు పట్టారు. బాధితులకు సేవలు అందించడంపై దృష్టి పెట్టవలసిన నగరపాలక సంస్థ పన్నుల వసూళ్లపై అత్యుత్సాహం చూపించటం సరికాదని, మున్సిపల్ శాఖ మంత్రి బాధితులను ఆదుకుంటామని ప్రకటనలు ఇస్తుంటే , పన్నుల వసూళ్లపై నగరపాలక సంస్థ ఆదేశాలు ఇవ్వటం భావ్యం కాదన్నారు.

2024- 25 సంవత్సరానికి సంబంధించి వరద బాధిత ప్రాంతాలలో ఆస్తి పన్ను, మంచినీరు, డ్రైనేజీ, ఖాళీ స్థలాల పన్ను పూర్తిగా రద్దు చేయాలని, అందుకు మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ నగరపాలక సంస్థకు ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలి, పన్నుల రద్దు వల్ల కోల్పోయే ఆదాయాన్ని ప్రభుత్వమే నగరపాలక సంస్థకు చెల్లించాలన్నారు.

# దసరా నాటికి నామినేటెడ్ పోస్టులు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 17:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతోంది. ఇంకా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన జరుగుతోంది. మూడు పార్టీలు కలిపి 164 అసెంబ్లీ,21 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించాయి. అయితే పొత్తులో భాగంగా సీట్లు దక్కని వారు నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. మూడు పార్టీల నేతలు పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆశావహుల జాబితా కూడా అధికంగా ఉంది. దీంతో ఎవరికి ఏ పదవి ఇవ్వాలో కసరత్తు జరుగుతోంది. మూడు పార్టీల మధ్య సమన్యాయం పాటించాల్సిన అవసరం సీఎం చంద్రబాబుపై పడింది. అందుకే నామినేటెడ్ పోస్టుల ప్రకటన జాప్యం అవుతోంది. అయితే కూటమి ప్రభుత్వం తొలిసారిగా ఒక నామినేటెడ్ పోస్టును భర్తీచేసింది. అనూహ్యంగా ఓ మాజీ అధికారికి పదవి ప్రకటించింది. ఏపీలో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ గా మాజీ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. వెను వెంటనే ఉత్తర్వులు కూడా జారీచేసింది. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏపీలో తొలి నామినేటెడ్ పదవి ఇదే. మూడు పార్టీల మధ్య ఎటువంటి అభ్యంతరాలు లేకుండా.. బీసీ వర్గానికి చెందిన ఓ మాజీ ఐఏఎస్ అధికారిని చంద్రబాబు ఎంపిక చేశారు. దీనిపై కృష్ణయ్య ఎంతగానో సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు ఆయన. ఇలా ఉత్తర్వులు వచ్చాయో లేదో కృష్ణయ్య పదవి బాధ్యతలు చేపట్టారు. పిసిబి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణయ్య టిడిపి కేంద్ర కార్యాలయానికి మర్యాదపూర్వకంగా వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. తన సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్ బాబు, నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రితో పాటు టిడిపి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. దసరా నాటికి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. అన్ని పదవులు ఒకేసారి కాకుండా విడతల వారీగా నియమించాలని నిర్ణయించారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి చాలామంది పోటీకి దూరమయ్యారు. పొత్తుల్లో భాగంగా మారిన సమీకరణలతో చాలామంది టిక్కెట్లు త్యాగం చేశారు. అటువంటి వారిలో దేవినేని ఉమా ఒకరు. ఆయనకు ఆర్టీసీ చైర్మన్ పదవి కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రవీణ్ కుమార్ రెడ్డికి ఏపీఐఐసీ చైర్మన్,పట్టాభికి పౌరసరఫరాల కార్పొరేషన్, మాజీమంత్రి పీతల సుజాతకు ఎస్సీ కమిషన్, మరో మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కు ఎస్టీ కమిషన్ పోస్టులు ఖరారు అయినట్లు తెలుస్తోంది. జనసేనతో పొత్తు విషయంలో చాలామంది టిడిపి నేతలు వెనక్కి తగ్గారు. అందులో ఆలపాటి రాజా ఒకరు. జనసేన కీలక నేతనాదెండ్ల మనోహర్ కోసం ఆయన తెనాలి సీటును వదులుకున్నారు. అందుకే ఆలపాటి రాజాకు అమరావతికి సంబంధించి కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 90 వరకు కార్పొరేషన్లు ఉన్నాయి. వాటిలో చైర్మన్లు, అందులో మెంబర్లు కలిసి వందల్లో నే పోస్టులు ఉన్నాయి ఇవి ఒకేసారి కాకుండా విడతల వారీగా భర్తీ చేస్తారని తెలుస్తోంది. తొలి విడతగా 30%పదవులు ప్రకటిస్తారని సమాచారం. ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల ప్రకటనకు సంబంధించి జాప్యం జరిగింది. ఆగస్టు 15 నాటికి ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. ఐ విఆర్ఎస్ ద్వారా సర్వే కూడా చేపట్టారు. నామినేటెడ్ పోస్టులకు సంబంధించి పేర్లను సహకరించారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అయితే సాంకేతికపరమైన అంశాలతో పాటు ఇటీవల వచ్చిన వరదలతో ఎప్పటికప్పుడు ఈ పోస్టుల ప్రకటనలో జాప్యం జరుగుతూ వచ్చింది. అయితే దసరాకు ముందే నామినేటెడ్ పోస్టుల ప్రకటన ఉంటుందని తెలుస్తోంది. దసరా నాటికి 30% పదవులు భర్తీ చేయాలని డిసైడ్ అయ్యారు. కొత్త ఫార్ములా తో చంద్రబాబు ఈ నియామకాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. టిడిపికి 60,జనసేనకు 30, బిజెపికి 10% పదవులు కేటాయించనున్నట్లు సమాచారం. అయితే అంతకంటే ముందే ఓ మాజీ ఐఏఎస్ అధికారికి నామినేటెడ్ పోస్ట్ కేటాయించడం విశేషం.

## భూమా వారి రెడ్ బుక్ రెడీ




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ కర్నూలు, సెప్టెంబర్ 17:** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేసిన కామెంట్స్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. తన వద్ద కూడా ఒక రెడ్ బుక్ ఉందని, అందులో చాలా మంది చెడ్డోళ్ల పేర్లున్నాయని ఆమె బహిరంగంగానే ప్రకటించారు. తాను ఎవరినీ వదలబోనని స్పష్టం చేశారు. నేనసలే ఊరుకునే దానిని కాదన్నారు. వారు అధికారంలో ఉండగా తమ వారిపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా వేధింపులకు గురిచేశారని, ఇప్పుడు వదులుతానని ఎలా అనుకున్నారని ఆమె ప్రశ్నించడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఎవరినీ వదిలి పెట్టబోమని అఖిల ప్రియ వార్నింగ్ ఇచ్చింది తన రాజకీయ ప్రత్యర్థులైన గంగుల కుటుంబంతోనూ, టీడీపీలోనే ఉన్న ఏవీ సుబ్బారెడ్డితో వైరం ఉంది. ఎవరిని ఉద్దేశించి అఖిలప్రియ ఆ వ్యాఖ్యలు చేశారన్నది ఇప్పుడు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఆళ్లగడ్డలో భూమా కుటుంబానికి, గంగుల ఫ్యామిలీకి మధ్య సుదీర్ఘకాలం వైరం ఉంది. 2019 ఎన్నికల్లో భూమా అఖిలప్రియ ఓటమి పాలయ్యారు. గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి గెలుపొందారు. గంగుల కుటుంబంతో ఆమె ఐదేళ్ల పాటు పోరాటం చేయాల్సి వచ్చింది. తన అనుచరులపై అక్రమ కేసులు పెట్టారని ఆమె ఆరోపిస్తూ అనేక సార్లు ఆందోళనకు కూడా దిగారు. దీంతో గంగుల కుటుంబం మీద రివెంజ్ తీర్చుకోవడానికి భూమా అఖిలప్రియ రెడీ అయినట్లుగానే కనిపిస్తుంది. అందుకే ఈ వార్నింగ్ ఇచ్చారంటున్నారు కొందరు. మరికొందరు మాత్రం గంగుల కుటుంబం మాత్రమే కాదు. ఏవీ సుబ్బారెడ్డి కుటుంబం పై కూడా అఖిలప్రియ గుర్రుగా ఉంది. అనేకసార్లు దాడులు కూడా ఒకరిపై ఒకరు చేసుకున్నారు. అనేక సార్లు హత్యాయత్నాలు కూడా జరిగాయి. భూమా నాగిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఏవీ సుబ్బారెడ్డి టీడీపీలోనే ఉన్నారు. ఆయన తన పార్టీలోనే ఉన్నా, తన తండ్రికి అత్యంత సన్నిహితుడైనా ఏవీ సుబ్బారెడ్డిని శత్రువుగానే పరిగణిస్తూ వచ్చారు. నాగిరెడ్డి చనిపోయిన తర్వాత ఆస్తుల వివాదమే ఈ విభేదాలకు కారణమని చెబుతుంటారు. అందుకే ఏవీ సుబ్బారెడ్డితో నిత్యం అమీతుమీ తేల్చుకునేందుకు భూమా అఖిలప్రియ సిద్ధమవుతున్నారని చెప్పకనే తెలుస్తుంది. ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాల్సిందేనా? సయోధ్యకు ప్రయత్నించినా... అయినా ఇద్దరూ ఒకే పార్టీలో ఉన్నారు. టీడీపీ నాయకత్వానికి ఇద్దరూ దగ్గరే. ఏవీ సుబ్బారెడ్డి కూడా గత ఎన్నికలకు ముందు ఆళ్లగడ్డలో తాను అఖిల ప్రియను ఓడిస్తానని బహిరంగంగానే సవాల్ విసిరారు. లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఏవీ సుబ్బారెడ్డి పై అఖిలప్రియ అనుచరులు దాడులు చేశారు. ఇరువర్గాలకు పార్టీ అధినాయకత్వం సర్ది చెప్పే ప్రయత్నం చేసినా సయోధ్య మాత్రం సాధ్యపడలేదు. ఇప్పుడు తాజాగా ఎమ్మెల్యే అఖిలప్రియ ప్రకటనతో ఆళ్లగడ్డలో ఏం జరుగుతుందోనన్న టెన్షన్ నెలకొంది. రెడ్ బుక్ పేరుతో తమను బెదిరించే ప్రయత్నాన్ని అఖిలప్రియ చేస్తున్నారంటూ ప్రత్యర్థి పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

## రవాణా ఖర్చులు తగ్గించేందుకు సర్కార్ నిర్ణయం




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ ఏలూరు, సెప్టెంబర్ 17:** ఉచిత ఇసుక విధానంలో వినియోగదారులపై రవాణా ఖర్చుల భారాన్ని తగ్గించేలా చంద్రబాబు నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఉచిత ఇసుక రవాణా ఛార్జీల నియంత్రణపై ప్రభుత్వం కసరత్తు చేసింది. రాష్ట్రం అంతటా ఒకే రకమైన రవాణా ఛార్జీలను వసూలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలను స్వల్పంగా తగ్గిస్తూ టారిఫ్ ను ఫిక్ చేస్తూ జీవో విడుదల చేసింది ప్రభుత్వం. ఇసుక రవాణా వాహనాల యజమానులతో సమావేశం అనంతరం రవాణా ఛార్జీల టారిఫ్‌ను ఫిక్స్ చేసింది ప్రభుత్వం. 10 కిలోమీటర్ల వరకు ట్రాక్టర్ కు కిలోమీటర్‌కు టన్‌కి 13.5 రూపాయలు వసూలు చేయాలని సూచించింది. అది 4.5 టన్‌ల వరకు వినాహాయింపు ఇచ్చింది. ఇక ఆరు టైర్ల ట్రక్‌కు కిలోమీటర్‌కి టన్‌కు 10 రూపాయల 70పైసలు 10 టన్‌ల వరకు వసూలు చేయాలని సూచించింది. 10లేదా 12లేదా 14 టైర్ ట్రక్ కు కిలోమీటర్‌కి టన్ కు 9.40 రూపాయలు.. 35 టన్నుల వరకు వసూలు చేయాలని చెప్పింది. అలాగే ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకున్నప్పుడే.. ఇంటి వద్దకు డెలివరీ కావాలనుకునే వాళ్లు ఆప్షన్ ఇస్తే, లారీలో ఇసుక సరఫరా చేయనున్నారు. ఇందులో భాగంగా రీచ్‌లు, స్టాక్ పాయింట్ల నుంచి వినియోగదారుల ఇళ్లకు ఇసుక రవాణా చేసేందుకు ఆసక్తి ఉన్న లారీల యజమానులు.. గనులశాఖ వద్ద రిజిస్టర్ చేసుకోవాలని జిల్లాల్లో కలెక్టర్లు ఆదేశించారు. దీంతో అన్ని జిల్లాల్లో కలిపి ఇప్పటికి 3 వేల లారీల యజమానులు తమ వాహనాల వివరాలను నమోదు చేసుకున్నారు. ఇవన్నీ జీపీఎస్ ఉన్నవి కావడంతో.. ఇసుక దారిమళ్లకుండా నిఘా నీడలో సరఫరా జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

## భారీగా పెరిగిన కూరల ధరలు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ కాకినాడ, సెప్టెంబర్ 17:** ఇటీవల కురిసిన భారీ వర్షాలు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేసిన సంగతి తెలిసిందే. లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నారు. ఇవన్నీ ఇప్పుడు సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్నాయి. కూరగాయలు, నిత్యావసరాల ధరలు చుక్కల్ని తాకుతున్నాయి. ఇటీవల వర్షాలకు కూరగాయల రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో దిగుబడులు తగ్గి కూరగాయలకు భారీ డిమాండ్ పెరిగింది. మార్కెట్లలో కూరగాయల రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లిపాయలు, బెండకాయ, బీరకాయ, సొరకాయ, చిక్కుడుకాయ...ఇలా ఒక్కొక్కటీ సెంచరీకి చేరువలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో పచ్చిమిర్చి కిలో రూ.80 ఉండగా, ఇక కొత్తిమీర అయితే కిలో రూ.200 పలుకుతుంది. పలు జిల్లాల్లో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. టామాటాలు రూ.40-రూ.50 మధ్య పలుకుతుండగా, చిక్కుడు కిలో రూ.100, బీరకాయ రూ.80, బెండకాయ రూ.70, క్యారెట్ రూ.100, కాకరకాయ రూ.80, క్యాలీఫ్లవర్ రూ.80 పలుకుతున్నాయి. గతంలో రూ.300 కూరగాయలు కొనుగోలు చేస్తే వారానికి సరిపడేవని, ఇప్పుడు కేవలం రెండు, మూడు రోజులకు మాత్రమే వస్తున్నాయని సామాన్యులు అంటున్నారు. ఉల్లిపాయలు కిలో రూ. 60 నుంచి రూ.70 పలుకుతున్నాయి. అతివృష్టితో తోటలు పాడవడంతో కూరగాయల రేట్లు భారీగా పెరిగాయని రైతులు అంటున్నారు. ఇలానే వర్షాలు కొనసాగితే కూరగాయల ధరలు 100 రూపాయలు దాటే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. గతంలో టమాటాలు, ఉల్లి ఇలా ఏదో ఒకదాని ధర మాత్రమే అమాంతం పెరిగేవి. ఇప్పుడు అన్ని కూరగాయల ధరలు ఒకేసారి పెరుగుతుండడంతో వినియోగదారులపై మరింత భారం పెరుగుతోంది. వంట నూనెలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచడంతో... వాటి ధరలు భారీగా పెరిగాయి. 15 కిలోల డబ్బా ధర రూ.1730 నుంచి రూ.2 వేలకు పెరిగింది. కిలో నూనె ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125కు పెరిగింది. గ్రామాల్లో అయితే కిలో ఆయిల్ ప్యాకెట్‌కు అదనంగా రూ.5 పెంచి అమ్ముతున్నారు. నిత్యావసరాల ధరలు మండిపోతుంటే ఇప్పుడు వాటికి నూనె ధరలు తోడైయ్యాయని వినియోగదారులు వాపోతున్నారు. అసలే పండుగ సీజన్ కావడంతో సామాన్యుడి జేబుపై మరింత భారం పడుతోందని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు.

# చాలా గ్యాప్ తర్వాత ఆ ఆటగాడికి చోటు ఖరారు!.. కెప్టెన్ రోహిత్ సంకేతాలు

### కేఎల్ రాహుల్ టాలెంట్ ఉన్న ఆటగాడన్న కెప్టెన్
### టెస్టు ఫార్మాట్‌లో రాహుల్ రాణిస్తాడని ఆశాభావం
### బంగ్లాదేశ్ తొలి టెస్ట్ ప్రారంభానికి ముందు ఆసక్తికర వ్యాఖ్యలు




గురువారం నుంచి భారత్–బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ షురూ కానుంది. చెన్నై వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో భారత తుది జట్టులో చోటు దక్కించుకోనున్న ఆటగాళ్లు ఎవరు అనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. వరుస వైఫల్యాలతో జట్టులో చోటు కోల్పోయిన కేఎల్ రాహుల్‌ను హిట్‌మ్యాన్ వెనుకేసుకొచ్చాడు. సమీప భవిష్యత్తులో టెస్టు ఫార్మాట్‌లో కేఎల్ రాహుల్ రాణిస్తాడని రోహిత్ శర్మ ఆశాభావం వ్యక్తం చేశాడు. రాహుల్ ఎంత నాణ్యమైన ఆటగాడో అందరికీ తెలుసని, అతడిలో ప్రతిభ ఉందని వ్యాఖ్యానించాడు. రాహుల్ తిరిగి జట్టులోకి రావడంతో తాము ఒక స్పష్టమైన సందేశం ఇవ్వాల్సి ఉంటుందని అన్నాడు. రాహుల్ దక్షిణాఫ్రికా టూర్‌లో సెంచరీ సాధించాడని, ఇంగ్లండ్‌తో హైదరాబాద్‌లో జరిగిన టెస్టులో 80 ప్లస్ పరుగులు సాధించాడని, అయితే దురదృష్టవశాత్తు గాయపడ్డాడని రోహిత్ ప్రస్తావించాడు. కేఎల్ రాహుల్ టెస్ట్ క్రికెట్‌లో బాగా ఆడాలని ఆశిస్తున్నట్టు తెలిపాడు.

కేఎల్ రాహుల్ తిరిగి పుంజుకుంటాడని తాను నమ్ముతున్నానని, అతడు టెస్ట్ క్రికెట్‌లో రాణించలేకపోవడానికి కారణాలేమీ తనకు కనిపించడం లేదని రోహిత్ పేర్కొన్నాడు.

ఇక బంగ్లాదేశ్‌తో 2 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌పై మాట్లాడుతూ... ప్రతి సిరీస్ ముఖ్యమైనదేనని అన్నాడు. ఒక సిరీస్ గెలుచుకున్నాం కాబట్టి ఆ తర్వాత సిరీస్‌పై దృష్టి పెట్టకపోవడం ఉండదని స్పష్టం చేశాడు. ఆడే ప్రతి సిరీస్‌ను గెలవాలని భావిస్తామని, ఇటీవల పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్ చారిత్రాత్మకమైన విజయం సాధించిన నేపథ్యంలో ఆ జట్టును తేలికగా తీసుకోబోమని వివరించాడు.

ఇటీవల అంతగా ఆకట్టుకోలేకపోతున్న కేఎల్ రాహుల్ టీ20 ఫార్మాట్‌లో చోటు కోల్పోయాడు. అంతేకాదు ఇటీవల శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో కూడా సెలక్టర్లు అతడిని పక్కనపెట్టారు.

ఇక టెస్ట్ జట్టులో అతడికి ఇబ్బందికర పరిస్థితులు నెలకున్నాయి. రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి రావడం, ఇంగ్లండ్ సిరీస్‌లో సర్ఫరాజ్ ఖాన్ ఆకట్టుకునే ప్రదర్శన చేయడంతో టెస్ట్ ఫార్మాట్‌లో అతడి స్థానం ప్రశ్నార్థకమైంది. ఈ ఏడాది ఆరంభంలో స్వదేశంలో ఇంగ్లండ్‌లో జరిగిన తొలి టెస్టులో కేఎల్ రాహుల్ ఆడాడు. గాయపడడంతో మిగతా నాలుగు టెస్టులకు అతడు దూరమైన విషయం తెలిసిందే.

# చెస్ ఒలింపియాడ్‌లో దూసుకెళ్తున్న ఇండియా జట్లు.. చెస్ జట్ల డబుల్ హ్యాట్రిక్



బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో ఇండియా జట్లకు తిరుగులేకుండా పోయింది. టోర్నీలో అబ్బాయిల, అమ్మాయిల జట్లు వరుసగా ఆరో విజయంతో డబుల్ హ్యాట్రిక్ సాధించాయి. ఓపెన్ సెక్షన్‌లో ఇండియా మెన్స్ టీమ్ 3%–%1తో హంగేరిని చిత్తుగా ఓడించింది. తెలంగాణ కుర్రాడు ఎరిగైసి అర్జున్ వరుసగా ఆరో విక్టరీ ఖాతాలో వేసుకున్నాడు. ఆరో రౌండ్‌లో నల్లపావులో ఆడిన అర్జున్ ఆఖర్లో మ్యాజిక్ చేసి 57 ఎత్తుల్లో సనమ్ సుగిరోవ్‌ను ఓడించాడు. విదిత్ సంతోష్ 52 ఎత్తుల్లో గెడురాను ఓడించాడు.

నల్లపావులతో ఆడిన గుకేశ్ 44 ఎత్తుల్లో రిచర్డ్ రాపోర్ట్‌తో డ్రా చేసుకోగా.. ప్రజ్ఞానంద 45 ఎత్తుల్లో పీటర్ లెకోతో పాయింట్ పంచుకున్నారు. మరోవైపు అమ్మాయిల జట్టు 2.5%–%1.5 తేడాతో అర్మేనియాపై ఉత్కంఠ విజయం సాధించింది. తెల్ల పావులతో ఆడిన ద్రోణవల్లి హారిక 44 ఎత్తుల్లో లిలిట్‌తో డ్రా చేసుకోగా.. రెండో బోర్డులో ఆర్. వైశాలి కూడా తన ప్రత్యర్థి మరియమ్‌తో పాయింట్ పంచుకుంది. అయితే, దివ్యా దేశ్‌ముఖ్ 40 ఎత్తుల్లో ఎలినాను ఓడించి జట్టును ఆధిక్యంలోకి తెచ్చింది. చివరి బోర్డులో తానియా సచ్‌దేవ్ 61 ఎత్తుల్లో అనా సర్గస్యన్‌తో డ్రా చేసుకోవడంతో ఇండియా గెలిచింది.

# 9 వికెట్లు పడగొట్టి అదరగొట్టిన సచిన టెండూల్కర్ కొడుకు అర్జున్..

ఆలూర్ (కర్నాటక): క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కొడుకు అర్జున్ కొత్త ఫస్ట్ క్లాస్ సీజన్‌కు ముందు తన బౌలింగ్ పవర్ చూపెట్టాడు. గోవా టీమ్‌కు ఆడుతున్న అర్జున్ కేఎస్‌సీఏ ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో కర్నాటకపై చెలరేగిపోయాడు. సోమవారం ముగిసిన ఈ పోరులో అర్జున్ (9/87) మొత్తంగా తొమ్మిది వికెట్లు పడగొట్టడంతో గోవా సీఏ ఎలెవన్ జట్టు ఇన్నింగ్స్ 189 రన్స్ తేడాతో ఆతిథ్య కర్నాటక ఎలెవన్‌ను చిత్తు చేసింది.తొలి ఇన్నింగ్స్‌లో అర్జున్ ఐదు వికెట్లు పడగొట్టగా.. కర్నాటక 103 రన్స్‌కే కుప్పకూలింది. ప్రతిగా గోవా 413 రన్స్ చేసి భారీ ఆధిక్యం దక్కించుకుంది. రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్జున్ నాలుగు వికెట్లు కూల్చగా.. కర్నాటక 121 రన్స్‌కే ఆలౌటై చిత్తయింది.





సిజ్లింగ్ సోనాల్ యొక్క అద్భుతమైన చిత్రాలు

# దేవర రెండో ఆయుధం అంచనాలకి మించి

పాన్ ఇండియా సినిమాలకి హైప్ క్రియేట్ చేయాలంటే అది సాంగ్స్, ట్రైలర్స్ తోనే సాధ్యం అవుతుంది. ట్రైలర్ బాగుంటే సినిమాపై ఆటోమేటిక్ గా అటెన్షన్ క్రియేట్ అవుతుంది. సినిమాకి ఎంత పబ్లిసిటీ చేసిన రాని హైప్ ఈ సాంగ్స్, ట్రైలర్స్ తో వస్తుందని సినీ విశ్లేషకులు చెప్పే మాట. ఇది నిజమేనని ‘బాహుబలి’ నుంచి రీసెంట్ గా వచ్చిన ‘కల్కి 2898ఏడీ’ సినిమా వరకు అన్ని ప్రూవ్ చేశాయి. ఒక వేళ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ ట్రైలర్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులని ఎట్రాక్ట్ చేయకుంటే మూవీ రిలీజ్ కి ముందు సెకండ్ ట్రైలర్ ని వదులుతున్నారు. ‘సలార్’, ‘కల్కి 2898ఏడీ’ సినిమాలకి ఇలా రెండు ట్రైలర్స్ స్ట్రాటజీ వర్క్ అవుట్ అయ్యింది. ఈ సినిమాల ప్రమోషన్స్ లో ప్రభాస్ పెద్దగా పాల్గొనకపోయిన ట్రైలర్స్ తోనే మూవీపై ప్రేక్షకుల అటెన్షన్ పెరిగింది. అది ఈ సినిమాల మొదటి రోజు కలెక్షన్స్ లో స్పష్టంగా కనిపించింది. ‘సిటాడెల్ సీజన్ 2’కి హలో చెప్పి షాకిచ్చిన పీసీ ప్రమోషన్ లో మొదటి ఆయుధంగా ‘దేవర’ మూవీ ట్రైలర్ ని ఇప్పటికే లాంచ్ చేశారు. అయితే ఈ ట్రైలర్ కి మిశ్రమ స్పందన వచ్చింది. ఎన్టీఆర్ అభిమానులని ట్రైలర్ అలరించిన సామాన్య ప్రేక్షకులకి మాత్రం పెద్దగా చేరువ కాలేదు. సినిమాలో ఇంట్రస్టింగ్ ఎలిమెంట్ ఏదో ఉందనే క్యూరియాసిటీని ట్రైలర్ క్రియేట్ చేయలేదనే మాట వినిపించింది. అలాగే గ్రాఫిక్స్ విషయంలో కూడా రకరకాల ట్రోల్స్ వచ్చాయి. దీంతో ‘దేవర’ సెకండ్ ట్రైలర్ ని పర్ఫెక్ట్ గా రిలీజ్ చేసేందుకు కొరటాల శివ సిద్ధం అవుతున్నాడంట. ఇప్పటికే సెకండ్ ట్రైలర్ కట్ ని రెడీ చేశారని తెలుస్తోంది. దానిని మరోసారి ఫైనల్ గా చూసుకొని మాస్ అండ్ యాక్షన్ ఎలివేషన్ షాట్స్ తో పవర్ ఫుల్ గా రెడీ చేసి వదలబోతున్నారని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. అయితే ఈ సెకండ్ ట్రైలర్ ని ఎప్పుడు రిలీజ్ చేస్తారనేది స్పష్టత లేదు. ప్రీరిలీజ్ ఈవెంట్ రోజు సెకండ్ ట్రైలర్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు. మరి ఈ సెకండ్ ట్రైలర్ పబ్లిక్ లో ఎలాంటి హైప్ క్రియేట్ చేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.







అమేజింగ్ అషు రెడ్డి ఎరుపు రంగులో మెరిసిపోయాడు: ఆమె అద్భుతమైన చిత్రాలను చూడండి!

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com